# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ 04.06.2025 | 24 క్యారెట్లు 92,215.00 | కిలో వెండి 1,07,457.00 | 32 ℃ | సంపుటి:3 | సంచిక:215

www.vishalabharati.com




## ఆర్సీబీకి తొలి ఐపీఎల్ టైటిల్

### 18 ఏళ్ల నిరీక్షణకు తెర..

- రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కల నెరవేరింది
- మూడుసార్లు ఆఖరి మెట్టుమీద తడబడిన ఆర్సీబీ
- ఎట్టేకేలకు ట్రోఫీ..పవర్ ప్లేలో 52 రన్స్ చేసిన పంజాబ్
- అయ్యర్ వికెట్‌తో మలుపు
- మెరిసిన కోహ్లీ.. భావోద్వేగానికి లోనైన కోహ్లీ.
- ఈ విజయం నాకే కాదు అభిమానులకు,
- మా జట్టుకు ఎంతో ప్రత్యేకం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఐపీఎల్‌లో ఛాంపియన్‌గా నిలవాలనుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కల నెరవేరింది. మూడుసార్లు ఆఖరి మెట్టు మీద తడబడిన ఆర్సీబీ ఎట్టేకేలకు ట్రోఫీని ముద్దాడింది. అహ్మదాబాద్‌లో ఉత్కంఠగా సాగిన ఫైనల్లో పంజాబ్ కింగ్స్ ను 6 పరుగుల తేడాతో ఓడించి విజేతగా అవతరించింది. విరాట్ కోహ్లీ(43), జితేశ్ శర్మ(24) మెరుపులతో 190 రన్స్ కొట్టిన బెంగళూరు.. కృనాల్ పాండ్యా(2 17) రాణించడంతో పంజాబ్‌ను కట్టడి చేసింది. శశాంక్ సింగ్(61 నాటౌట్) చివరిదాకా పోరాడినా ఓటమిని తప్పించలేకపోయాడు. చివరి ఓవర్లో శశాంక్ 22 సిక్సర్లతో చెలరేగినా.. బెంగళూరు విజయం ఖాయమైంది. బెంగళూరు నిర్దేశించిన భారీ ఛేదనలో పంజాబ్ ఓపెనర్లు దూకుడుగా ఆడారు. ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న ప్రియాన్ష్ ఆర్య(24) బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అయితే.. ప్రభ్‌సిమ్రన్(26) సింగ్‌కు 9 పరుగుల వద్ద లైఫ్ లభించింది. హేజిల్‌వుడ్ ఓవర్లో అతడిచ్చిన సులువైన క్యాచ్‌ను షెపర్డ్ నేలపాలు చేశాడు. చేతుల్లో పడిన బంతిని ఒడసి పట్టుకోలేకపోయాడు. ఆ తర్వాత హేజిల్‌వుడ్ ఓవర్లో వరుసగా 2 ఫోర్లు బాదిన ప్రియాన్ష్.. చివరకు అతడి ఓవర్లోనే వెనుదిరిగాడు. పవర్ ప్లేలో 52 రన్స్ చేసిన

..మిగతా 2 లో

## మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్
# 24 గంటలు అందుబాటులో ఉండాలి



- భారీ వర్షాలు నేపథ్యంలో సమీక్ష నిర్వహించిన సీఎం
- వర్షాలు, వరదలకు సంబంధించి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మానిటరింగ్
- వర్షం పడ్డట్టప్పుడు పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీలు అప్రమత్తంగా ఉండాలి
- అసంపూర్తిగా ఉన్న నాలాల పూడికతీత పనులు వీలైనంతగా త్వరగా పూర్తి చేయాలి
- హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** అనుకున్న సమయానికంటే మందే నైరుతి రుతు పవనాలు తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురవనున్నాయంటూ ఇప్పటికే వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంగళవారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే గుర్తించిన 141 వాటర్ లాగింగ్ పాయింట్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ పనుల్లో పురోగతిపై ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. హార్వెస్టింగ్ వెల్స్‌లోకి చేరే వర్షపు నీటిని ఆటోమేటిక్ పంపుల ద్వారా బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలంటూ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలు, వరదలకు సంబంధించి

..మిగతా 2 లో

# 91,840 మందికి డిగ్రీలు ప్రదానం

- జేఎన్టీయూ 13వ స్నాతకోత్సవంలో 2023-23 విద్యాసంవత్సరానికి 78 మందికి గోల్డ్ మెడల్స్
- చీఫ్ గెస్టుగా హాజరైన గవర్నర్
- కేంద్ర, రాష్ట్రాల నుంచి పరిశోధనలకు రూ.498 కోట్లు
- వెల్లడించిన జిష్ణుదేవ్ వర్మ



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:** జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, హైదరాబాద్ 13వ స్నాతకోత్సవం సందర్భంగా 202323 విద్యా సంవత్సరానికి చెందిన 91,840 మందికి డిగ్రీలు ప్రదానంచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ గవర్నర్, జేఎన్టీయూ హెచ్ చాన్సలర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అత్యున్నత ప్రతిభ కనబరిచిన పలువురికి గోల్డ్ మెడల్స్ అందజేశారు. అనంతరం గవర్నర్

..మిగతా 2 లో



### కేసీఆర్, రేవంత్ ఎదురుపడితే
## నమస్కరిస్తా

- నాయకులు మాట్లాడుకోకుండా ఉండటం మంచిది కాదు
- సంకుచిత ఆలోచనలు మానుకోవాలి
- ఎంపీ ఈటల రాజేందర్

2 లో



2 లో

## ట్రంప్ కు మోదీ లొంగిపోయారు

- ఇది బీజేపీ, ఆర్ఎస్ఎస్ లక్షణం
- ట్రంప్ ఆదేశాలను మోదీ తూచా తప్పకుండా అమలు చేశారు
- రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు

## వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేస్తే ఊరుకోం

- కమల్ హాసన్‌పై కర్ణాటక హైకోర్టు ఆగ్రహం
- మీరు ఏ లెక్కన ఆ వ్యాఖ్యలు చేశారు?
- మీరేమైనా చరిత్రకారుడా? లేదంటే భాషావేత్తనా?"
- కమల్‌ను ప్రశ్నించిన న్యాయమూర్తి నాగప్రసన్న
- కన్నడ ప్రజల మనోభావాలు దెబ్బతీశారని వ్యాఖ్య
- కన్నడిగులకు క్షమాపణలు చెప్పాలని ఆదేశం
- కన్నడ భాష తమిళం నుంచే పుట్టిందన్న కమల్ హాసన్
- థగ్‌లైఫ్ సినిమాను ప్రదర్శించకూడదన్న కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ప్రముఖ నటుడు, రాజకీయ నాయకుడు కమల్ హాసన్‌పై కర్ణాటక హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజల మనోభావాలను దెబ్బతీసేందుకు వాక్ స్వాతంత్ర్యం హక్కును దుర్వినియోగం చేయొద్దని ఆయనను హెచ్చరించింది. తీవ్ర వివాదానికి కేంద్ర బిందువుగా మారిన "కన్నడ భాష తమిళం

..మిగతా 2 లో

## ఇది నిజమైన ఇందిరమ్మ రాజ్యం



- ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఎమోషనల్
- లబ్ధిదారుల కష్టాలు విని భావోద్వేగానికి లోనై కన్నీరుపెట్టుకున్న ఎమ్మెల్యే
- ఇంత చిన్న వయసులో ఇందిరమ్మ ఇండ్లు పేదలకు అందించే అవకాశం దక్కడం అదృష్టం
- ఈ అవకాశం కల్పించిన నియోజకవర్గ ప్రజలకు, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు
- పాలకుర్తి ,పెద్దవంగర, తొర్రూరు, రాయపర్తి మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ

..మిగతా 3 లో

## బ్రహ్మపుత్ర నీటిని చైనా ఆపినా ఏం కాదు

- కాలం చెల్లిన సింధూ నదీజలాల ఒప్పందం నుంచి భారత్ వైదొలగింది
- ప్రతిగా బ్రహ్మపుత్ర నదీజలాలను చైనా ఆపేస్తుంది
- ఆ నదికి ఆయువుపట్టు భారత్‌లోనే ఉంది
- బ్రహ్మపుత్ర ప్రవాహ ఉధృతి భారత్‌లోనే ఎక్కువ
- చైనా వదిలే బ్రహ్మపుత్ర నదీజలాలపై భారత్ ఆధారపడి లేదు
- బ్రహ్మపుత్ర వరదల వల్ల ఏటా లక్షలాది మంది నిరాశ్రయులు
- పాక్ కు అసోం సీఎం స్ట్రాంగ్ కౌంటర్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** పాకిస్థాన్‌కు సింధూ నదీజలాలను ఆపుతున్నట్టే, భారత్‌కు బ్రహ్మపుత్ర నదీ జలాలను చైనా ఆపేస్తుందని దాయాది ఇచ్చిన వ్యాఖ్యలపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ

..మిగతా 2 లో

## భారత్ ఉగ్రవాదం అణు బ్లాక్ మెయిల్ నీడలో జీవించదు

- యుద్ధంలో నష్టాలు కాదు, ఫలితాలే ముఖ్యం
- నష్టాల గురించి మాట్లాడటం సరైనది కాదు
- పాక్ పై జరిపిన ఆపరేషన్లు ఎనిమిది గంటల్లో ముగిశాయి
- సీడీఎస్ అనిల్ చౌహాన్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** పాక్ లోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ పై సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధంలో నష్టాలు ముఖ్యం కావని, ఫలితమే ముఖ్యమన్నారు. మహారాష్ట్రలోని పుణెలోని సావిత్రిబాయి పులే విశ్వవిద్యాలయంలో ఓ ప్రత్యేక ఉపన్యాసంలో పాక్, ఉగ్రవాదంపై సీడీఎస్ మండిపడ్డారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత్ వైపు జరిగిన నష్టాల గురించి నన్ను అడుగుతున్నారు. అసలు ఆపరేషన్ సమయంలో నష్టాలు కావు. ఫలితాలే ముఖ్యం. నష్టాల గురించి మాట్లాడటం సరైనది కాదు. మీరు క్రికెట్ టెస్ట్ మ్యాచ్ కు వెళ్లి ఇన్నింగ్స్ తేడాతో గెలిస్తే, ఎన్ని వికెట్లు, ఎన్ని బంతులు, ఎంత మంది ఆటగాళ్లు అనే

..మిగతా 2 లో



## బనకచర్ల ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తున్నాం

- ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అభ్యంతరాలపై కేంద్రానికి తెలియజేశాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

3 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
04.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ప్రత్యేక పార్లమెంట్ సమావేశం ఏర్పాటు చేయండి

విశాలభారతి, స్టేట్ బ్యూరో; ఆపరేషన్ సిందూర్‌పై ప్రత్యేక పార్లమెంటు సమావేశం ఏర్పాటు చేయాలని 16 విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఢిల్లీలోని కానిస్టిట్యూషన్‌క్లబ్‌లో సమావేశమైన విపక్ష పార్టీల నేతలు ప్రధానికి లేఖ రాయాలని నిర్ణయించారు. అనంతరం కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన-యూబీటీ ఎంపీల సంతకాలతో ప్రధానికి లేఖ రాశారు. కరుణానిధి జయంతి సందర్భంగా సమావేశానికి హాజరుకాలేకపోయిన డీఎంకే ఎంపీలు లేఖపై సంతకాలు చేశారు. నేషనల్ కాన్ఫరెన్స్, సీపీఎం, ఏయూఎంఎల్, ఆరెస్పీ, వీసీకే, కేరళ కాంగ్రెస్, ఎండీఎంకే, సీపీఐఎంల్ పార్టీ ఎంపీలు కూడా లేఖపై సంతకాలు చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ విపక్ష నేతల సమావేశానికి గైర్హాజరైంది. కానీ నేరుగా ప్రధాని మోదీకి లేఖ రాస్తామని తెలిపింది. పహల్గాం దాడిపై ప్రత్యేక పార్లమెంటు సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని లేఖలో ఎంపీలు డిమాండ్ చేశారు. ఇండి కూటమిలో భాగమైన ఎన్సీపీ ఈ సమావేశానికి దూరంగా ఉంది. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌పై వివరించేందుకు అఖిలపక్ష ఎంపీలు వివిధ దేశాలకు వెళ్లినందున వారు తిరిగి వచ్చిన తర్వాత జూన్‌లోనే ప్రత్యేక సమావేశం నిర్వహించాలని తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

## మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్
# 24 గంటలు అందుబాటులో ఉండాలి

తరువాయి భాగం



కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మానిటరింగ్ చేసేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాలు పడినప్పుడు హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ విభాగాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నాలుగు విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న నాలాల పూడికతీత పనులు వీలైనంతగా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆయన కోరారు. ఇక సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలనున్న కోర్ అర్బన్ రీజియన్‌లో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డీసిల్టింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని చెరువులు, నాలాలు, రోడ్ల విస్తరణ, అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక పాలసీని తయారు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ అధికారులు శేషాద్రి, మాణిక్ రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హెచ్ఎండీఏ అధికారులతో పాటు ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# 91,840 మందికి డిగ్రీలు ప్రదానం

తరువాయి భాగం

జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. 2023 2024 విద్యా సంవత్సరానికి గాను మొత్తం 91,840 డిగ్రీలు ప్రదానం చేస్తున్నామని, అందులో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టర్ ఆఫ్ ఫార్మసీ, డాక్టరేట్ ప్రోగ్రాములు ఉన్నట్లు తెలిపారు. పతక విజేతలకు గవర్నర్ అభినందనలు తెలిపారు. ఈ విజయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల మద్దతు అమోఘమని కొనియాడారు. జాతీయ విద్యా విధానం అమలులో విశ్వవిద్యాలయం అగ్రగామిగా నిలుస్తోందన్నారు. నూతన కోర్సులు, డిజిటల్ ఆధారిత, అభ్యాస కేంద్రిత మోడళ్లను ప్రవేశపెట్టి విద్యారంగంలో ఉన్నత ప్రమాణాలు పాటిస్తోందని గవర్నర్ కొనియాడారు. ఈసందర్భంగా రూ.498 కోట్ల పరిశోధన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల నుంచి పొందినట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాల అనుసరణలో భాగంగా 25 దేశాల నుంచి 237 విదేశీ విద్యార్థులు జేఎన్టీయూలో చేరడం వల్ల గ్లోబల్ గుర్తింపును చాటుతోందని వివరించారు. శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణలు, సమాజసేవలలో విశ్వవిద్యాలయం అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.




# వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేస్తే ఊరుకోం

తరువాయి భాగం

నుంచే పుట్టింది" అనే వ్యాఖ్యను ఉపసంహరించుకోవాలని కమల్‌కు హైకోర్టు మంగళవారం సూచించింది. కన్నడ భాషపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు థగ్‌లైఫ్ సినిమాను ప్రదర్శించకూడదన్న కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కమల్ హాసన్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు నటుడు కమల్ హాసన్ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఇప్పటికైతే ఈ విషయాన్ని మీకే వదిలేస్తున్నాం మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోలేరు. కానీ అందుకు క్షమాపణలు చెప్పొచ్చు. పగలగొట్టి వండేసిన గుడ్లను మీరు పగలగొట్టని పూర్వ స్థితికి తీసుకెళ్లలేరు" అని కమల్‌కు హైకోర్టు హితవు పలికింది. గతంలో ఎప్పుడో ఏదో జరిగిపోయి ఉంటే, దాన్ని రివర్స్ చేయలేమనే అర్థాన్ని ఇచ్చే ఒక ఆంగ్ల నానుడిని ప్రయోగిస్తూ న్యాయస్థానం ఈ కామెంట్స్ చేసింది. "మీరు సాధారణ వ్యక్తేం కాదు. మీకు వాక్ స్వాతంత్ర్యం ఉంది. కానీ దానితో ఇతరులను బాధపెట్టకూడదు. ఇతరులను బాధపెట్టడం కోసం మీకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను ఇవ్వలేదు. ఇప్పటికైతే ఈ విషయాన్ని మీకే వదిలేస్తున్నాం. మీరు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమాపణలు చెప్పండి" అని కమల్‌కు హైకోర్టు నిర్దేశించింది. 'థగ్ లైఫ్' సినిమాను ప్రస్తావించిన హైకోర్టు జూన్ 5న విడుదలకానున్న కమల్ హాసన్ సినిమా 'థగ్ లైఫ్'ను ఈ సందర్భంగా న్యాయస్థానం పరోక్షంగా ప్రస్తావించింది. "కన్నడ భాషను ఉద్దేశించి మీరు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోండి. కర్ణాటకలోనూ కోట్లు సంపాదించుకోవచ్చు. మీకు కన్నడ ప్రజలు అక్కర్లేదని భావిస్తే ఆదాయాన్ని వదులుకోండి" అని కమల్‌ను హైకోర్టు కోరింది. పబ్లిక్ సెంటిమెంటును ఎవరు దెబ్బతీసినా తాము ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చింది. "కన్నడ ప్రజలను బాధపెట్టేలా మాట్లాడింది మీరు, ఇప్పుడేమో క్షమాపణ చెప్పనని వాదిస్తున్నారు. కర్ణాటక ప్రజల సెంటిమెంట్‌ను మీరు తక్కువ అంచనా వేశారు. మీరు ఏ లెక్కన ఆ వ్యాఖ్యలు చేశారు? మీరేమైనా చరిత్రకారుడా? లేదంటే భాషావేత్తనా?" అని కమల్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగప్రసన్న ప్రశ్నించారు. "నా మాటల వల్ల ఎవరికైనా బాధ కలిగి ఉంటే క్షమించండి అని మీరు ప్రకటించండి" అని కమల్‌కు న్యాయమూర్తి నిర్దేశించారు. కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వార్నింగ్ కన్నడ ప్రజలకు కమల్ హాసన్ క్షమాపణ చెప్పకుంటే థగ్ లైఫ్ సినిమాను తమ రాష్ట్రంలో రిలీజ్ చేయనిచ్చేది లేదని కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (KFCC) సోమవారం వార్నింగ్ ఇచ్చింది. అయితే తాను క్షమాపణ చెప్పేది లేదని గత శుక్రవారం (మే 30న) కమల్ స్పష్టం చేశారు. తాను మాట్లాడిన దాంట్లో తప్పేం లేదన్నారు. ఇది ప్రజాస్వామిక దేశమని, చట్టంపై తనకు నమ్మకం ఉందన్నారు.

# బ్రహ్మపుత్ర నీటిని చైనా ఆపినా ఏం కాదు

తరువాయి భాగం

ఘాటుగా స్పందించారు. భారత్‌లోకి ప్రవేశించాక బ్రహ్మపుత్ర నది ప్రవాహ పరిధి పెరుగుతుందే తప్ప తగ్గదని ఆయన గుర్తు చేశారు. ఈ మేరకు హిమంత బిశ్వశర్మ ఎక్స్ లో పోస్ట్ చేశారు. కాలం చెల్లిన సింధూ నదీజలాల ఒప్పందం నుంచి భారత్ వైదొలగినందుకు పాక్ కొత్త కుట్రలు మొదలు పెట్టింది. భారత్‌లో ఆందోళనను రేకెత్తించే అపోహలను ప్రచారంలోకి తెస్తోంది. బ్రహ్మపుత్ర నదిని చైనా ఆపితే ఏమవుతుంది ? అనే దానిపై అలుముకున్న అపోహలను మనం భయంతో కాకుండా వాస్తవాలతో పటాపంచలు చేయాలి. ఈ అంశంతో ముడిపడిన వాస్తవాలను దేశ ప్రజలకు తెలియపర్చాల్సిన అవసరం ఉంది' అసోం సీఎం పేర్కొన్నారు. బ్రహ్మపుత్రలో మెజారిటీ భాగం భారత్‌లోనే 'బ్రహ్మపుత్ర నదీజలాల మొత్తం ప్రవాహంలో 30 నుంచి 35 శాతమే చైనా పరిధిలో జరుగుతుంది. హిమానీ నదాలు కరగడం వల్ల, టిబెట్ ప్రాంతంలో వర్షాల వల్ల అక్కడ బ్రహ్మపుత్ర నదీప్రవాహం ఏర్పడుతుంది. మిగతా 65 నుంచి 70 శాతం జలప్రవాహ భాగమంతా భారత్ పరిధిలోనే ఏర్పడుతుంది. భారత్‌లో బ్రహ్మపుత్ర నదీ జలాల ప్రవాహానికి అరుణాచల్ ప్రదేశ్, అసోం, నాగాలాండ్, మేఘాలయలలో కురిసే రుతుపవన వర్షాలే ప్రధాన ఆధారం. బ్రహ్మపుత్ర నుంచి భారత్‌లో సుబాన్ సిరి, లోహిత్, కామెంగ్, మానస్, ధన్ సిరి, జియా భరాలి, కోపిలి అనే ఉపనదులు ఏర్పడతాయి. క్రిష్ణయి, దిగారు, కుల్సి నదుల ద్వారా ఖాసి, గారో, జైన్ తియా హిల్స్ నుంచి కూడా బ్రహ్మపుత్ర నదిలోకి జలాలు చేరుతుంటాయి' అని హిమంత బిశ్వశర్మ వివరించారు. 'భారత్ చైనా బార్డర్‌లోని అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో ట్యూటింగ్ పట్టణం ఉంది. అక్కడ బ్రహ్మపుత్ర నదీ ప్రవాహ ఉధృతి సెకనుకు 2000 నుంచి 3000 క్యూబిక్ మీటర్లు ఉంటుంది. బ్రహ్మపుత్ర నది అసోంలోని గువహటి వద్దకు చేరే సరికి ప్రవాహ ఉధృతి సెకనుకు 15వేల నుంచి 20వేల క్యూబిక్ మీటర్లకు పెరుగుతుంది. చైనా వదిలే బ్రహ్మపుత్ర నదీజలాలపై భారత్ ఆధారపడి లేనే లేదు. భారతదేశంలోని వర్షాధారిత అంతర్గత నదుల వ్యవస్థ వల్లే బ్రహ్మపుత్ర నదిలో ప్రవాహ ఉధృతి పెరుగుతోంది. ఈ కారణం వల్లే బ్రహ్మపుత్ర నది భారత్‌లోకి ప్రవేశించాక అదనపు జలాలను కలుపుకొని ప్రవాహ ఉధృతిని పెంచుకుంటుంది' అని అసోం సీఎం హిమంత బిస్వశర్మ తెలిపారు. చైనా ఎన్నడూ ఇలాంటి హెచ్చరికలు చేయలేదు 'బ్రహ్మపుత్ర నది విషయంలో చైనా ఎన్నడూ అధికారిక వేదికల్లో భారత్‌కు హెచ్చరికలు చేయలేదు. ఒకవేళ భారత్ వైపుగా వచ్చే బ్రహ్మపుత్ర నదీజలాలను చైనా అడ్డుకుంటే, అసోంకు వరదల ముప్పు తగ్గిపోతుంది. బ్రహ్మపుత్ర వరదల వల్ల ఏటా లక్షలాది మంది నిరాశ్రయులు అవుతున్నారు. ఎంతోమంది ఉపాధిని కోల్పోతున్నారు. సింధూ నదీజలాల ఒప్పందం పేరుతో గత 74 ఏళ్లుగా ఆ నీటిని పొందడంలో పాకిస్థాన్ అక్రమంగా ప్రాధాన్యతను పొందింది. తద్వారా ఆ ఒప్పందాన్ని దుర్వినియోగం చేసింది. ఇప్పుడు సింధూ నదీజలాలపై సార్వభౌమ అధికారాన్ని భారత్ ప్రకటించగానే పాక్ భయానికి లోనవుతోంది. బ్రహ్మపుత్ర నదిని ఏదో ఒక దేశం కంట్రోల్ చేయడం లేదని పాకిస్థాన్ గుర్తుంచుకోవాలి. భౌగోళిక స్వరూపం, రుతుపవనాలు, నదుల వ్యవస్థ అనే అంశాల వల్లే బ్రహ్మపుత్ర నది భారతదేశంలో అంతగా ప్రవహిస్తోందని తెలుసుకోవాలి. అని సీఎం హిమంత హితవు పలికారు. పాకిస్థాన్‌కు సింధూ నదీజలాలను భారత్ ఆపేసినట్టే, భారత్‌కు బ్రహ్మపుత్ర నదీజలాలను చైనా ఆపేస్తుందని ఇటీవలే పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సీనియర్ సహాయకుడు రాణా ఇహ్సాన్ అఫ్జల్ వ్యాఖ్యానించారు. దీనికి సీఎం హిమంత కౌంటర్ ఇస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.



## భారత్ ఉగ్రవాదం
# అణు బ్లాక్ మెయిల్ నీడలో జీవించదు

తరువాయి భాగం

ప్రశ్నే ఉండదు. మేము ఆపరేషన్ సమయంలో శత్రు దేశానికి చెందిన ఎన్ని విమానాలను, రాడార్లను నాశనం చేశామని తెలియజేస్తాం. పాక్ పై జరిపిన ఆపరేషన్లు ఎనిమిది గంటల్లో ముగిశాయి. వెంటనే పాక్ కాల్పుల విరమణకు పిలుపునివ్వాల్సి వచ్చింది. మే 10వ తేదీన అర్ధరాత్రి ఒంటి గంటకు దాడులు ప్రారంభం అయ్యాయని, 48 గంటల్లో భారత్ను మోకరిల్లేలా చేయాలనే ఉద్దేశంతో పాకిస్థాన్ తొలుత ఈ దాడులను చేపట్టిందని సీడీఎస్ అనిల్ చౌహాన్ తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పదేపదే ఉల్లంఘించడం, కవ్వింపు చర్యలకు పాల్పడడం వంటి రెచ్చగొట్టే చర్యల ద్వారా భారత్తో యుద్ధ తీవ్రతను పెంచడానికి కారణమైందన్నారు. నిజానికి భారత ఆర్మీ ఉద్దేశం మాత్రం పాక్, పీఓకేలో గల ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేయడమేనని, దాన్ని సాధించామని పేర్కొన్నారు. ఉగ్రమూకల ఏరివేత 48 గంటల పాటు కొనసాగుతాయని పాక్ భావించిందని, ఈ ఆపరేషన్ దాదాపు 8 గంటల్లో ముగిసిపోయిందని చెప్పారు.ఈ యుద్ధానికి ప్రధాన కారణం పహల్గామ్ ఉగ్రవాద దాడేనని అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. ఉగ్రవాద దాడులకు ఎలాంటి హేతుబద్ధత లేదని, దాన్ని యుద్ధంగా పరిగణించలేమని తేల్చి చెప్పారు. భారత్ ను రక్తసిక్తం చేయాలని పాక్ నిర్ణయించిందన్నారు. 1965లో జుల్ఫికర్ అలీ భుట్టో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ప్రసంగిస్తూ భారత్పై 1,000 సంవత్సరాల యుద్ధాన్ని ప్రకటించాడని గుర్తు చేసుకున్నారు. ప్రొఫెషనల్ మిలిటరీ దళాలు ఎదురుదెబ్బలు లేదా నష్టాల వల్ల ప్రభావితం కావు. పాకిస్థాన్ నుంచి ప్రాయోజిత ఉగ్రవాదం ఆగిపోవాలి. భారత్ ఉగ్రవాదం, అణు బ్లాక్ మెయిల్ నీడలో జీవించదు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత సాయుధ దళాలు తమ స్థాయిని పెంచుకున్నాయి. పహల్గాం ఉగ్రవాద దాడికి కొన్ని వారాల ముందు పాక్ సైన్యాధిపతి అసిమ్ మునీర్ భారత్, హిందువులపై విషం కక్కారు" అని సీడీఎస్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు

# ట్రంప్ కు మోదీ లొంగిపోయారు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:
ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు ప్రధాని మోదీ లొంగిపోయారని ఆరోపించారు. మధ్యప్రదేశ్లోని భోపాల్లో జరిగిన కాంగ్రెస్ పార్టీ కన్వెన్షన్లో పాల్గొన్న రాహుల్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ ప్రారంభం కాగానే మోదీకి ట్రంప్ ఫోన్ చేశారు. ఏం చేస్తున్నారని ఫోన్లో ట్రంప్ అడిగారు. తరువాత 'నరేందర్ సరెండర్' అన్నారు. అంతే మోదీ కాల్పుల విరమణ ప్రకటించారు. ఈ విధంగా ట్రంప్ ఆదేశాలను మోదీ తూచా తప్పకుండా పాటించారు. అమెరికాను లెక్కచేయని ఇందిరా గాంధీ 1971 ఇండో పాక్ యుద్ధ సమయంలో అమెరికా బెదిరింపులను ఇందిరా గాంధీ లెక్క చేయకుండా, బంగ్లాదేశ్ ఆవిర్భావం జరిగేలా చేశారని రాహుల్ గాంధీ గుర్తుచేశారు. ఈ విధంగా కాంగ్రెస్ అగ్రరాజ్యం అమెరికాకు వ్యతిరేకంగా పోరాడిందని ఆయన అన్నారు. '1971 ఇండోపాక్ యుద్ధ సమయంలో అమెరికా, భారత్ను బెదిరించింది. తరువాత అమెరికా తన ఏడవ నౌకాదళాన్ని, ఆయుధాలను, విమాన వాహక నౌకను పాక్కు సాయంగా పంపించింది. అయినా అప్పటి భారత ప్రధానమంత్రి ఇందిరా గాంధీ చలించలేదు. మేము ఏం కావాలంటే అదే చేస్తామని తేల్చి చెప్పింది. చివరికి 1971 యుద్ధం ద్వారా పాక్ను రెండుగా చీలేలా చేసింది' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భోపాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో 'సంఘటన్ సృజన్ అభియాన్' ప్రారంభించిన రాహుల్, ఆ తరువాత ఎక్స్లో ఓ పోస్ట్ పెట్టారు. . ట్రంప్ కు మోదీ లొంగిపోయారు ఇందుకు చరిత్రే సాక్షి. ఇది బీజేపీ, ఆర్ఎస్ఎస్ లక్షణం. వారు ఎల్లప్పుడూ తలవంచుకుంటూ ఉంటారు. నాకు బీజేపీఆర్ఎస్ఎస్ వ్యక్తులు తెలుసు. మీరు కొంచెం ఒత్తిడి తెచ్చినా, ఏమాత్రం బెదిరించినా వారు భయంతో పారిపోతారు" అని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు.ఈ సందర్భంగా రాహుల్ తమ పార్టీ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. 'కాంగ్రెస్ సింహాలు, సివంగులు అగ్రరాజ్యాలతో పోరాడతాయి. వారు ఎప్పుడూ ఎవరికీ తలవంచరు. మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, వల్లభ్ బాయ్ పటేల్ ఎప్పుడూ లొంగిపోలేదు. వారు అగ్రరాజ్యాలతో పోరాడారు' అని రాహుల్ అన్నారు.

# కేసీఆర్, రేవంత్ ఎదురుపడితే నమస్కరిస్తా

- **నాయకులు మాట్లాడుకోకుండా ఉండటం మంచిది కాదు**
- **సంకుచిత ఆలోచనలు మానుకోవాలి**
- **ఎంపీ ఈటల రాజేందర్**

విశాలభారతి, స్టేట్ బ్యూరో:
నాయకులు కలిసినప్పుడు మాట్లాడుకోకుండా ఉండే సంస్కృతి మంచిది కాదని, తనకు మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డి ఎవరు ఎదురుపడినా నమస్కారం చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ మాధవనగర్ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లకు మంగళవారం ఆయన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఈటల మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ మానవ సంబంధాలు ముఖ్యమని, సంకుచిత ఆలోచనలు మానుకోవాలని సూచించారు. కేంద్రం అయినా రాష్ట్రం అయినా ప్రజల సొమ్ముకు కాపలాదారులు మాత్రమేనని, తామిచ్చామంటే.. తామిచ్చామని చెప్పడం మంచిది కాదన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ప్రతి రోజు సాయంత్రం ఏ పార్టీ ఎమ్మెల్యే అయినా ఆయన్ను కలిసే అవకాశం ఉండేదని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రతి మూడు నెలలకోసారి జిల్లా ప్రజాప్రతినిధులతో మీటింగ్ పెట్టాలని మంత్రి శ్రీధర్ బాబును ఈటల కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎక్కడికైనా పోతానని, ఎవరి భాధ్యత వారు నెరవేర్చాలని సూచించారు. మల్కాజిగిరి ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోందన్నారు. దేశంలో అన్ని ప్రాంతాలవారు ఈ నియోజకవర్గంలో ఉంటారని, అందుకే అభివృద్ధికి ఎక్కువ నిధులు కేటాయించాలి ఈటల కోరారు. ఈ కార్యక్రమంలో చంపాపేట్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి, చంపాపేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బనకచర్ల ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తున్నాం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:
గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తున్నామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అందులో భాగంగా ఈ ప్రాజెక్ట్‌ను అడ్డుకునేందుకు తాము ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ అంశాన్ని ఇప్పటికే కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకు వెళ్లి.. మాట్లాడామన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మించకుండా అడ్డుకోవాలని ఆయన్ని కోరామని చెప్పారు. అలాగే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అభ్యంతరాలపై ఇప్పటికే కేంద్రానికి తెలియజేశామన్నారు. ఆ క్రమంలో గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, కేంద్ర జల్ శక్తి మంత్రికి లేఖలు రాసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ఇంకా ఎలాంటి ప్రయత్నాలు చేయాలో అవన్నీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గోదావరి నదికి వరద పోటెత్తే క్రమంలో నీరు సముద్రం పాలవుతుంది. ఈ నేపథ్యంలో ఆ నీటిని ప్రజా ప్రయోజనాల కోసం మళ్లించాలని ఏపీలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.అందులోభాగంగా బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా ఆ వరద నీటిని రాయలసీమతోపాటు ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు మళ్లించాలని భావించింది. తద్వారా తాగు, సాగు నీటి అవసరాలు తీర్చవచ్చని చెప్పింది. ఆ క్రమంలో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై కేంద్రంతో ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు చర్చించారు. అలాగే ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల కలిగే లాభాలను సైతం కేంద్రానికి లేఖ ద్వారా సీఎం చంద్రబాబు వివరించారు. ఈ నేపథ్యంలో జూన్ 2వ తేదీన న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శితో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులతో ఏపీ జల వనరులు శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీ ప్రభుత్వ నీటి సలహాదారు వెంకటేశ్వరరావు సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం గురించి కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శికి ఏపీ అధికారులు సోదాహరణగా వివరించారు. ఈ సందర్భంగా ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల తెలంగాణకు ఏమైనా నష్టం జరిగే అవకాశముందా అనే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు.. ఏపీ అధికారులను ప్రశ్నించగా.. వాటికి సైతం రాష్ట్ర అధికారులు స్పష్టమైన వివరణ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఏపీ ప్రభుత్వం రూ. 81 వేల కోట్లతో నిర్మించ తలపెట్టిన సంగతి తెలిసిందే. మరోవైపు బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణంపై ఇప్పటికే బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కె. కవిత అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌ను ఏపీ నిర్మిస్తుందని ఆమె ఇటీవల మీడియాలో మాట్లాడుతూ గుర్తు చేశారు. ఈ అంశంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.

## సిపిఐ సూర్యాపేట జిల్లా 4 వ మహాసభను జయప్రదం చేయండి

తిరుమలగిరి, విశాలభారతి: మంగళవారం తిరుమలగిరి మండలం వెలిశాల క్రస్ రోడ్డులో సి.పి ఐ. జిల్లా 4 వ మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరిచడం జరిగింది. ఈ కరపత్రం ఆవిష్కరణ సందర్భంగా సిపిఐ కార్యర్గసభ్యులు, తుంగతుర్తి నియోజకవర్గ ఇంచార్జి ఎల్లంల యాదగిరి మాట్లాడుతూ నాడు స్వాతంత్ర ఉద్యమంలో సిపిఐ పార్టీ పోరాటం చేసి భారతదేశానికి ముఖ్య పాత్ర పోషించింది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపి 10 లక్షల భూమి పేదలకు పంచింది.తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం, తెలంగాణ సాధించడంలో ప్రత్యేక పాత్ర పోషించింది. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి నేటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద కార్మిక, కర్షక, మహిళ,యువజన విద్యార్థి సంస్థ ప్రజల కోసం పోరాటాలు చేస్తుంది. 100 సంవత్సరాల పోరాట చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ సూర్యాపేట జిల్లా నాల్గవ మహాసభలు సూర్యాపేట పట్టణంలోని రితిక ఇన్ హోటల్ ఈనాడు ఆఫీసు ఎదురుగా జరుగుచున్నది. ఈ మహాసభలో ముఖ్య అతిథులుగా కామ్రేడ్ కోనమనేని సాంబశివరావు, ఎమ్మెల్యే శాసన సభ్యులు. కామ్రేడ్ పల్లా వెంకట్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర కార్యదర్శి సభ్యులు, కామ్రేడ్ నెల్లికంటి సత్యం శాసనమండలి సభ్యులు ఇతర నాయకులు పాల్గొననున్నారు. కావున ఈ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సయ్యద్ ఫయాజ్ మియా, మండల సహాయ కార్యదర్శి సట్టు నరసయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఇక్బాల్ , ప్రజానాట్యమండల్లి జిల్లా అధ్యక్షులు జంపాల మల్లయ్య, సుంచు సత్తయ్య, దేవర నరసయ్య, గుగులోత్ బీమా, పి రాములు, దేవర వెంకన్న, గుగులోతు రాజు, దేవర వీరన్న తదితరులు పాల్గొన్నారు.



### కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి
# ప్రతీ కార్యకర్త కృషి చేయాలి

- హనుమాండ్ల ఝాన్సిరెడ్డి

దేవరుప్పల, విశాలభారతి: మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ అధ్యక్షతన మండల ఎంపీటీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ల రివ్యూ మీటింగ్ నిర్వహించిన పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమండ్ల ఝాన్సిరెడ్డి మండలానికి చెందిన క్లస్టర్ కోఆర్డినేటర్లను ఉద్దేశించి పార్టీ కార్యచరణ, బాధ్యతలు, కార్యసాధనపై వారు స్పష్టమైన దిశనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఝాన్సిరెడ్డి మాట్లాడుతూ ప్రతి కోఆర్డినేటర్ తన పరిధిలో ఉన్న గ్రామాల్లో యాక్టివ్‌గా తిరిగి, ప్రజలతో అనుసంధానాన్ని పెంచాలని,పార్టీ సిద్ధాంతాలు, గత ప్రభుత్వ అవినీతిపై అవగాహన కల్పించాలని,రాబోయే ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి మీరే కీలక శక్తి అని,పార్టీ అభ్యర్థుల విజయం కోసం ప్రతి కార్యకర్త గ్రామ స్థాయిలో పోరాటం చేయాలని,కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదల పక్షాన నిలబడిన పార్టీ అని,ఇప్పుడు మళ్లీ ప్రజల ఆశల్ని నెరవేర్చే సమయం వచ్చిందని,మనం కట్టుబాటుతో, సమర్థతతో ముందుకు సాగితే పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురాగలమని,సమావేశంలో మండల అధ్యక్షులు, మండల కోఆర్డినేటర్లు, ఎంపీటీసీ కోఆర్డినేటర్లు, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా, స్థానిక సమస్యలు, బూత్ స్థాయి వ్యూహాలు, ఓటర్లతో నడిపే ప్రచార కార్యక్రమాలపై చర్చ జరిగింది.ప్రతీ కోఆర్డినేటర్‌ను వ్యక్తిగతంగా ఉత్సాహపరిచి, తగిన మార్గదర్శకత్వాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన నాయకులు,మహిళా నాయకురాల్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

- జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి




తొర్రూరు, విశాలభారతి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే బడిబాట ప్రచార జాతాను డీఈవో రవీందర్ రెడ్డి మంగళవారం పట్టణంలోని గాంధీ సెంటర్ వద్ద టిఎస్ యూటీఎఫ్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బడి మనదే బడి బాధ్యత మనదే అనే నినాదంతో , మన ఊరు పిల్లలను మన ఊరు ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిద్దాం, నాణ్యమైన విద్యను పొందుదాం ఫీజుల భారాన్ని తగ్గించుకుందాం , ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దామని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచుటకు ఊరూరా ప్రచార జాతా నిర్వహించడంచడం పట్ల టిఎస్ యూటీఎఫ్ ను అభినందించారు. విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు, ఏఐ ఆధారిత బోధన, డిజిటల్ తరగతి గదులు లైబ్రరీ, ఆటపాటలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిపుణులైన ఉపాధ్యాయులతో ఒత్తిడి లేని చదువు అందించబడుతుందని,పిల్లల మానసిక ఆరోగ్యానికి వ్యక్తిత్వ వికాస్వానికి అణువుగా ప్రభుత్వ పాఠశాల రూపుదిద్దుకుంటున్నాయని, జిల్లా విద్యాశాఖ,ఉపాధ్యాయుల సమిష్టి కృషితో ఈ సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణతలో రాష్ట్రంలోనే మొదటి స్థానం పొందామని, తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రయివేట్ పాఠశాలల మోజులో పడకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీ కృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేటు విద్యా వ్యాపారం విచ్చలవిడిగా సాగుతున్నదని,సంపాదన సగం పైగా పిల్లల చదువుల కోసమే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, , విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని మేము భరోసా ఇస్తున్నామని, సామాజిక బాధ్యత కలిగిన ఉపాధ్యాయ సంఘం గా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ బడుల బాగు కోసం పిల్లలందరికీ అంతరాలు లేని నాణ్యమైన విద్యను అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని, గురుకులాలతోపాటు ప్రభుత్వ పాఠశాలను కూడా సెమీ రెసిడెన్షియల్ పద్ధతిలో అభివృద్ధి పరచాలన్నారు.ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఆజాద్ చంద్రశేఖర్,మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్, జిల్లా ఉపాధ్యక్షులు నామ వెంకటేశ్వర్లు, కోశాధికారి కె. నాగమల్లయ్య, జిల్లా కార్యదర్శి ఎన్ జనార్ధన చారి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కె బిక్షపతి, మండలాల బాధ్యులు యు వెంకటేశ్వర్లు, జి రంజిత్, కె వంశీ కృష్ణ, ఆర్ విజయ్ కుమార్, జి శేఖర్, బి పార్వతి రాథోడ్, ఎండి నాగుమీరా, ఓ చైతన్య, రాయలు, వెంకటేశ్వర్లు, మధు, వెంకన్న, రవీందర్, శరత్, మహేందర్, మహేష్, ప్రేమ్ చందర్, ఎస్ఎఫ్ఐ నాయకులు అమీర్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్సీబీకి తొలి ఐపీఎల్ టైటిల్

తరువాయి భాగం



పంజాబ్ పటిష్ట స్థితిలో ఉంది. కానీ, కృనాల్ పాండ్యా ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ భువనేశ్వర్‌కు తేలికైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం వచ్చిన వచ్చిన శ్రేయాస్ అయ్యర్ (1) నిరాశపరిచాడు. క్వాలిఫయర్ 2లో అజేయ అర్ధ శతకంతో జట్టును గెలిపించిన అతడు షెపర్డ్ బౌలింగ్‌లో బంతిని థర్డ్ మ్యాన్ దిశగా ఆడబోయి వికెట్ కీపర్ జితేశ్ చేతికి చిక్కాడు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే ఇంగ్లిస్‌ను కృనాల్ ఔట్ చేయగా 94 వద్ద నాలుగో వికెట్ పడింది. ప్రధాన బ్యాటర్లు పెవిలియన్ చేరగా ఒత్తిడిలో పడిన పంజాబ్‌ను గెలిపించే బాధ్యత తీసుకున్నారు. అప్పటికీ విజయానికి 42 బంతుల్లో 90 పరుగులు కావాలి. ఆ దశలో షెపర్డ్ ఓవర్లో నేహల్ వధేరా(15)లాంగాఫ్‌లో భారీ సిక్సర్ బాదాడు. అనంతరం హేజిల్‌వుడ్ వేసిన 16 వ ఓవర్లో స్లో బాల్‌ను శశాంక్ సింగ్(61 నాటౌట్ ) అలవోకగా స్టాండ్స్‌లోకి పంపాడు. చివరి బంతిని కూడా సిక్సర్‌గా మలవడంతో వరుసగా రెండు ఓవర్లలో 13 రన్స్ వచ్చాయి. ఐదో వికెట్‌కు 38 రన్స్ జోడించిన నేహల్‌ను భువీ ఔట్ చేసి.. మార్కస్ స్టోయినిస్(6)ను కూడా వెనక్కి పంపి ఆర్సీబీని పోటీలోకి తెచ్చాడు. అజ్మతుల్లా ఒమర్‌జాయ్(0)ను దయాల్ డకౌట్ చేయగా పంజాబ్ ఓటమి అంచున నిలిచింది. చివరి రెండు ఓవర్లలో 42 రన్స్ అవసరం కాగా.. శశాంక్ సింగ్(0) సిక్సర్లతో చెలరేగాడు. హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో 6, 4, 6, 6 బాది అర్ధ శతకం సాధించాడు. కానీ, ఆర్సీబీ 6 పరుగుల తేడాతో ఛాంపియన్‌గా అవతరించింది.ఐపీఎల్ 18వ సీజన్ ఫైనల్ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లు తడబడ్డారు. పంజాబ్ కింగ్స్ పేసర్ కైలీ జేమీసన్(348), అర్షదీప్ సింగ్(340)లు విజృంభించడంతో పెద్ద స్కోర్ చేయలేకపోయారు. డేంజరస్ ఫిల్ సాల్ట్(16) విఫలం కాగా.. రజత్ పాటిదార్(26)ను ఔట్ చేసిన జేమీసన్ బెంగళూరును దెబ్బ కొట్టాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా విరాట్ కోహ్లీ(43) కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. డెత్ ఓవర్లలో జితేశ్ శర్మ (24), ధనాధన్ ఆడాడు. జేమీసన్ వేసిన 17వ ఓవర్లో.. రెచ్చిపోయిన జితేశ్ మూడు సిక్సర్లతో 23 రన్స్ పిండుకున్నాడు. అతడి మెరుపులతో ఆర్సీబీ స్కోర్ 170కి చేరుకుంది. మరో మూడు ఓవర్లు ఈ ఇద్దరూ నిలబడితే 200 ప్లస్ ఖాయం అనిపించింది. కానీ, జేమీసన్ ఓవర్లో లివింగ్‌స్టోన్ ఔట్ కాగా.. ఆ తర్వాత జితేశ్‌ను విజయ్‌కుమార్ బౌల్డ్ చేసి ఆర్సీబీ భారీ స్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు. అయితే.. అజ్మతుల్లా వేసిన 19వ ఓవర్లో రొమారియో షెపర్డ్(17) వరుసగా 4, 6 బాదాడు. కానీ, అర్షదీప్ చివరి ఓవర్లో అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు వికెట్లు తీయడంతో ఆర్సీబీ 190కే పరిమితమైంది.

ఐపీఎల్ 18వ సీజన్ ఫైనల్ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లు తడబడ్డారు. పంజాబ్ కింగ్స్ పేసర్ కైలీ జేమీసన్(348), అర్షదీప్ సింగ్(340)లు విజృంభించడంతో పెద్ద స్కోర్ చేయలేకపోయారు. డేంజరస్ ఫిల్ సాల్ట్(16) విఫలం కాగా.. రజత్ పాటిదార్(26)ను ఔట్ చేసిన జేమీసన్ బెంగళూరును దెబ్బ కొట్టాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా విరాట్ కోహ్లీ(43) కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. డెత్ ఓవర్లలో జితేశ్ శర్మ (24), ధనాధన్ ఆడాడు. జేమీసన్ వేసిన 17వ ఓవర్లో.. రెచ్చిపోయిన జితేశ్ మూడు సిక్సర్లతో 23 రన్స్ పిండుకున్నాడు. అతడి మెరుపులతో ఆర్సీబీ స్కోర్ 170కి చేరుకుంది. మరో మూడు ఓవర్లు ఈ ఇద్దరూ నిలబడితే 200 ప్లస్ ఖాయం అనిపించింది. కానీ, జేమీసన్ ఓవర్లో లివింగ్‌స్టోన్ ఔట్ కాగా.. ఆ తర్వాత జితేశ్‌ను విజయ్‌కుమార్ బౌల్డ్ చేసి ఆర్సీబీ భారీ స్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు. అయితే.. అజ్మతుల్లా వేసిన 19వ ఓవర్లో రొమారియో షెపర్డ్(17) వరుసగా 4, 6 బాదాడు. కానీ, అర్షదీప్ చివరి ఓవర్లో అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు వికెట్లు తీయడంతో ఆర్సీబీ 190కే పరిమితమైంది.

# ఇది నిజమైన ఇందిరమ్మ రాజ్యం

- ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఎమోషనల్
- లబ్ధిదారుల కష్టాలు విని భావోద్వేగానికి లోనై కన్నీరుపెట్టుకున్న ఎమ్మెల్యే
- ఇంత చిన్న వయసులో ఇందిరమ్మ ఇండ్లు పేదలకు అందించే అవకాశం దక్కడం అదృష్టం
- ఈ అవకాశం కల్పించిన నియోజకవర్గ ప్రజలకు, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు
- పాలకుర్తి ,పెద్దవంగర, తొర్రూరు, రాయపర్తి మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ



విశాలభారతి,పాలకుర్తిః

పెద్దవంగరలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఎమోషనల్ అయ్యారు. ఇందిరమ్మ పట్టాల లబ్ధిదారుల కష్టాలు విని భావోద్వేగానికి లోనై కన్నీరు పెట్టుకున్నారు. ఇంత చిన్న వయసులో ఇందిరమ్మ ఇండ్లు, పేదలకు అందించే అవకాశం కల్పించిన నియోజకవర్గ ప్రజలకు, సీఎం రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబానికి ఒక కల అన్నారు. ఇందిరమ్మ పథకం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ఇండ్ల స్థలాల పట్టాలు ఎంతో మంది పేదలకు భవిష్యత్తులో ఆర్థిక భద్రత కలిగిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పట్టాలు అందుకున్న లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. స్వంత ఇల్లు కలగాలని ఎదురుచూస్తున్న తమ కలను నెరవేర్చినందుకు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు.

**తొర్రూరులో..**

తొర్రూరు మండల కేంద్రంలోని ఆర్&బి గెస్ట్ హౌస్ లో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఇండ్ల స్థలాల పట్టాలను అందజేశారు. ఇది నిజమైన ఇందిరమ్మ రాజ్యమని అన్నారు. ఇక్కడ ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతోందని, ఇంటి కోసం ఎదురు చూస్తున్న పేదలకు ఈ పట్టాలు వారి కలలను సాకారం చేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఆశ్రయమైన ఇంటిని కల్పించడంలో ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం తలదాచుకునే ఇంటి కోసం భూమిని, నిర్మాణానికి ఆర్థికసహాయాన్ని అందిస్తోందని తెలిపారు.

**రాయపర్తిలో..**

రాయపర్తి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేసారు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. రాష్ట్రంలో ఉన్న పేద ప్రజలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పదేళ్ల నిరీక్షణ తర్వాత ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పేదలకు పంచుతుంటే వారి నుండి అనుహస్పందన వస్తుందని,పేదవారి సొంతింటి కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు. అన్ని వర్గాల అభివృద్ధియే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

**పాలకుర్తిలో..**

పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ గ్రామాల పేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు న్యాయం జరుగుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పేదల జీవితాల్లో సుస్థిరత తీసుకురావడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. ఇందిరమ్మ పథకం ద్వారా పేదల ఇంటి కల నెరవేరుతోందన్నారు.

**వరి విత్తనాలు పంపిణీ**

పెద్దవంగర మండలంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఇటీవల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అందిస్తున్న ఫౌండేషన్ వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. రైతుల అభ్యున్నతికే రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కోసం ప్రభుత్వం అందిస్తున్న నాణ్యత గల ఫౌండేషన్ వరి విత్తనాలు రైతులకు ఉచితంగా అందించడం ద్వారా భవిష్యత్తులో అధిక దిగుబడి సాధించేందుకు ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనల ద్వారా అభివృద్ధి చేసిన ఈ విత్తనాలు,కేవలం పంట దిగుబడిని పెంచడమే కాకుండా రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రైతు సంక్షేమమే తన ప్రథమ కర్తవ్యమని, రైతుల బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

తొర్రూరులో నూతన వాహనాలు ప్రారంభం

తొర్రూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ వాహనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి..నూతన వాహనాలను పచ్చజెండా ఊపి ప్రారంభించారు.తొర్రూరు పట్టణం శుభ్రంగా, అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో మున్సిపల్ కార్యాలయానికి అందిన ఈ వాహనాల ద్వారా పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలను అందించేందుకు తోడ్పడతాయన్నారు.పట్టణంలోని పారిశుధ్య పరిరక్షణ, డ్రైనేజ్ నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి అంశాల్లో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మున్సిపల్ వ్యవస్థను బలోపేతం చేస్తోందన్నారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
04.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# పర్యావరణ పరిరక్షణ పై అవగాహన ర్యాలీ

**సూర్యాపేట,విశాలభారతి:**

అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 5న పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు గ్రీన్ క్లబ్ ట్రస్ట్ అధ్యక్షులు ముప్పారపు నరేందర్ తెలిపారు. మంగళవారం గ్రీన్ క్లబ్ ట్రస్ట్ కార్యాలయము లో అవగాహన ర్యాలీ పోస్టర్ ను సుధాకర్ పివిసి మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్ చేతుల మీదుగా ఆవిష్కరింప చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ తిరస్కరించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం ప్రజల్లో అవగాహన కల్పించడం కొరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి కొత్త బస్టాండ్ వరకు ఉదయం 7 గంటలకు ర్యాలీ నిర్వహిస్తున్నందున విద్యార్థులు, పట్టణ ప్రజలు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతము చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోట కిరణ్ సభ్యులు తల్లాడ రామచంద్రయ్య, సోమ సురేష్ తదితరులు పాల్గొన్నారు..



# వాసవి క్లబ్ సేవలు అభినందనీయం

- **అశోక్ నగర్ లో 'వాసవి' అధ్వర్యంలో 75 రోజులు మజ్జిగ, మంచినీటి పంపిణీ**

**పటాన్ చెరు,విశాలభారతి**

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం.. సేవా కార్యక్రమాలను నిర్వహించి వాసవి క్లబ్ అందరి ప్రశంసలు అందుకుంటోంది. అశోక్ నగర్, రామచంద్రపురం బీహెచ్ఈఎల్ వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహించి అందరి మన్ననలు పొందాయి. రామచంద్రపురం పరిధిలోని అశోక్ నగర్ లో వినాయక ఆలయం సమీపంలో వేసవి కాలం సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు చేసి 75 రోజుల పాటు మజ్జిగ, మంచినీరు ఉచితంగా అందజేసి ప్రజల దాహం తీర్చింది. 75 రోజుల పాటు ప్రజలకు సేవలు అందించిన వాసవి క్లబ్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వాసవి క్లబ్ల వివిధ శాఖలకు చెందిన అధ్యక్షులు శృతి, పి. వెంకట తేజ, వి.మస్తానయ్య మాట్లాడుతూ ప్రజాసేవే వాసవి క్లబ్ లక్ష్యమన్నారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు అశోక్ నగర్, అనిత, మనం, రామచంద్రపురం క్లబ్ ల ఆధ్వర్యంలో సంయుక్తంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి 75 రోజుల పాటు మజ్జిగ, మంచి నీటిని అందించడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలను వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ నాయకులు మనోజ్ కుమార్, భానూరి నర్సింలు, రామకృష్ణ, నాగలక్ష్మి, నాగేశ్వర్ రావు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



## నిజమైన పేదలకు పథకాలు

# అందటమే కాంగ్రెస్ ధ్యేయం

**తొర్రూరు - విశాల భారతి**

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం కన్నీరు పెట్టుకున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తొర్రూరు: పేద ప్రజల అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తెలిపారు మంగళవారం తొర్రూరు పెద్ద వంగర పాలకుర్తి మండలాల్లో అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల పత్రాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా పెద్ద వంగరలో నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్లు పట్టాలను పంపించేస్తూ భావోద్వేగానికి గురైన ఎమ్మెల్యే కంటతడి పెట్టుకున్నారు దీంతో ఊరుకో అక్క అంటూ యువ ఎమ్మెల్యేను మహిళలు ఓదార్చారు కాంగ్రెస్ ప్రభుత్వంలో తమ చేతుల మీదుగా నిరుపేదలకు ఇండ్ల పట్టాలను అందజేయడం ఆనందంగా ఉందన్నారు లబ్ధిదారులకు దశలవారీగా రూ.5లక్షలు ప్రభుత్వం మంజూరి చేస్తుందన్నారు ఈ పథకం ద్వారా పేదోళ్ల సొంతింటి కల నెరవేరుతుందన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు చేపట్టినట్లు తెలిపారు ఈ ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని రైతులకు విత్తనాలు అందించారు రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని అధికారులు ఆదేశించారు అనంతరం తొర్రూరు మున్సిపాలిటీ లో 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి రూపాయలు 89 లక్షలతో కొనుగోలు చేసిన జెసిబి వాటర్ ట్యాంకర్లు చెత్త సేకరణ వాహనాలను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు తొర్రూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలుపుతానని తెలిపారు పట్టణంలోని పారిశుధ్య పరిరక్షణ డ్రైనేజీ నిర్వహణ త్రాగునీటి సరఫరా పట్టణ అభివృద్ధిపై నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు అభివృద్ధిని చూసి కొంతమంది ఓర్వలేఖ పోతున్నారని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని తెలిపారు ఈ సందర్భంగా పట్టణంలోని బీరప్ప నగర్ కాలనీవాసులు సీసీ రోడ్డు, సైడ్ కాలువలు నిర్మించాలంటూ ఎమ్మెల్యే కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ లీడర్లు కార్యకర్తలు వివిధ శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు

## ప్రారంభమైన భూభారతి రెవిన్యూ సదస్సులు

**దేవరుప్పల, విశాలభారతి:**

నేటి నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి చట్టం అమలులోకి వచ్చింది.భూభారతి చట్టాన్ని ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రెవిన్యూ,గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపి ఏప్రిల్ 14వ తేదీన భూభారతి చట్టాన్ని ప్రారంభించి జిల్లాకు ఒక మండలం చొప్పున పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. అందులో భాగంగానే దేవరుప్పుల మండలం,గొల్లపల్లి గ్రామంలో భూభారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు మండల తహసీల్దార్ ఆండాలు సదస్సు నిర్వహించి భూభారతిలో ప్రజల, రైతులసందేహాలను,అనుమానాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజు,సర్వేయర్ అరుణ జ్యోతి,జూనియర్ అసిస్టెంట్ వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల స్థలం కబ్జాకు యత్నించిన ప్రైవేట్ వ్యక్తులు

- **కంచెను తొలగించి, అక్రమంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు**
- **స్థలం పరిరక్షించాలంటూ ఎమ్మెల్యే, ఉపకమిషనర్ ను కలిసి విజ్ఞప్తి చేసిన జర్నలిస్టులు.**



చందానగర్ సర్కిల్ 21డిప్యూటీ కమిషనర్ మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టు నాయకులు.

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

శేరిలింగంపల్లి నియోజకవర్గం జర్నలిస్టుల గృహ వసతి కోసం చందానగర్ లో కేటాయించిన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నించారు. అక్రమంగా స్థలంలోకి చొరబడి కంచెను తొలగించి కడీలను ధ్వంసం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు అనుమతి లేకుండా స్తంభాలను ఏర్పాటు చేశారు.వివరాల్లోకి వెళ్తే...శేరిలింగంపల్లిలో పనిచేస్తున్న జర్నలిస్టుల కోసం ప్రభుత్వం రెండేళ్ల క్రితం చందానగర్ సర్వేనెంబర్ 174లో ఎకరం స్థలం కేటాయించింది. అందులో రెండు పడకల ఇళ్లు నిర్మించి ఇవ్వాలంటూ సదరు స్థలాన్ని జీహెచ్ఎంసీకి అప్పగించింది. రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేయగా, సదరు స్థలాన్ని జీహెచ్ఎంసీ స్వాధీనం చేసుకుంది. స్థలం చుట్టూ కడీలతో కంచెను ఏర్పాటు చేశారు. అయితే ఖాళీగా ఉన్న స్థలంపై కన్నేసిన కొందరు ప్రైవేటు వ్యక్తులు సోమవారం స్థలంలోకి అక్రమంగా చొరబడ్డారు. 50 మంది బౌన్సర్లను రంగంలోకి దింపి స్థలం చుట్టూ ఉన్న కంచెను తొలగించి కడీలను ధ్వంసం చేశారు. విద్యుత్ శాఖ అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా 33కేవీ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న పలువురు జర్నలిస్టులు కబ్జా చేస్తున్న దృశ్యాలను చిత్రీకరిస్తుండగా అడుకున్న ప్రైవేటు వ్యక్తులు ఫోన్ లాక్కొని చంపేస్తామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో అక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు పోలీసులను ఆశ్రయించారు.

**పోలీసులకు ఫిర్యాదు...**

జర్నలిస్టుల కోసం కేటాయించిన స్థలంలోకి అక్రమంగా చొరబడి అక్రమణ కు యత్నించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సిందిగా చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్ రెడ్డి మంగళవారం చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలం చుట్టూ వేసిన కంచెను తొలగించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సదరు స్థలాన్ని పరిరక్షించేందుకు చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదన చేయనట్టు చెప్పారు. నిధులు మంజూరు అయిన వెంటనే ప్రహరీ నిర్మిస్తామన్నారు.

**స్తంభాల తొలగింపు...**

విద్యుత్ శాఖ అధికారుల అనుమతి లేకుండా చందానగర్ సర్వేనెంబర్ 174 లో అక్రమంగా వేసిన విద్యుత్ స్తంభాలను మంగళవారం తొలగించారు. విద్యుత్ శాఖ ట్రాన్స్మిషన్ విభాగం ఏడిఈ, వేమన కాలనీ విద్యుత్ ఉపకేంద్రం ఏ ఈ లు సదరు స్థలాన్ని పరిశీలించారు. తమ అనుమతి లేకుండా స్తంభాలు వేశారని, కాంట్రాక్టర్ ను పిలిపించి స్తంభాలను తొలగించారు. అనుమతి లేకుండా స్తంభాలు వేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**కేసు నమోదు....**

స్థలంలోకి చొరబడి ఆక్రమణ కు యత్నించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చందానగర్ ఇన్స్పెక్టర్ విజయ్ స్పష్టం చేశారు.

**న్యాయం చేయాలి...**

జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం జర్నలిస్టు సంఘాల నాయకులు సలీం పాషా, కొండా విజయ్ కుమార్, మాధవ రెడ్డి, ప్రసాద్,శేఖర్ సాగర్, విట్టల్ రెడ్డి, రమేష్ సాగర్, శ్రీనివాస్ తో పాటు పలువురు జర్నలిస్టులు ఎమ్మెల్యే గాంధీ, చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్ రెడ్డిలను కలిసి వినతి పత్రం అందజేశారు. కంచెను తొలగించి ఆక్రమణకు యత్నించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన జర్నలిస్టులకు రెండు పడకల ఇళ్లు నిర్మించాలని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గాంధీ జర్నలిస్టుల గృహవసతి కోసం కేటాయించిన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించే ప్రయత్నం సరికాదాని, ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి స్థలాన్ని పరిరక్షిస్తామన్నారు.



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీకి ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టు నాయకులు



జర్నలిస్టులకు కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ ను తొలగించిన కబ్జాదారులు.



## నాణ్యమైన విత్తనంతోనే

# అధిక దిగుబడులు

**ఆర్మూర్,విశాలభారతి:**

రైతులు నాణ్యమైన విత్తనాన్ని వాడినప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి జోష్ణ భవాని తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో గల రైతు వేదికలో గ్రామానికి నాణ్యమైన విత్తనం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ గ్రామానికి రెండు వరి వంగడాలు RDR1200 మరియు పెసర పంట MGG 347 అనే వెరైటీ కిట్స్ లను రైతులకు అందజేశారు. నాణ్యమైన విత్తనాలు వాడినప్పుడు 10 శాతం నుండి 15శాతం వరకు దిగుబడి పెరుగుతుంది. నాణ్యమైన విత్తనాన్ని రైతులు సాగు చేసి తదుపరి పంట ద్వారా ఉత్పత్తి అయిన విత్తనం తోటి రైతు సోదరులకు తక్కువ ధరకే అందజేయాలని అన్నారు. ఈ రకం సాగు చేసిన రైతులకు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా సలహాలు మరియు సూచనలు ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



# వనస్థలిపురంలో పార్కు, డ్రైనేజ్లైన్ ప్రారంభం

- **ప్రారంభించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు**

**ఎల్బీనగర్ విశాలభారతి :**

ఎల్బీనగర్ పరిధిలోని వనస్థలిపురం డివిజన్లో మంగళవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి దుద్దిళ్ల శ్రీధర్బాబు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. డివిజన్లోని జహంగీర్నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ పైప్లైన్ ను, మల్లికార్జున నగర్లో జీహెచ్ఎంసీ పార్కును కాంగ్రెస్పార్టీ ఎల్బీనగర్నియోజకవర్గ ఇన్చార్జి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న, వజీర్ ప్రకాశ్ గౌడ్, మల్లికార్జున కాలనీ ప్రెసిడెంట్ ప్రేమ్, ప్రధాన కార్యదర్శి ఎండీ. నిరంజన్, హరినాథ్రెడ్డి, సాయి కిరణ్ గౌడ్, రాజేందర్ రెడ్డి, వెంకట్రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

బుధవారం,
04.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## విద్యుత్ షాక్ తో వివాహిత మహిళ మృతి

**తొర్రూరు, విశాలభారతి:**

తొర్రూరు మండల కేంద్రంలో మున్సిపాలిటీ ఆఫీస్ వద్ద ఉన్న ఓ ఇంట్లో పని మనిషిగా (కూలీ చేస్తుండగా) బట్టలు ఉతికి ఇనుప తీగ (దండం) పై ఆరేస్తుండగా అదే ఇనుప తీగ కు ఉన్న కరెంటు సర్వీస్ వైర్ ఉండడం తో షాక్ కు గురై మండలం లోని పత్తే పురం గ్రామానికి చెందిన ఓరుగంటి శైలజ వయస్సు (35)సంవత్సరాలు అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సమాదానికి కారణమైన ఇంటి యజమానిపై చర్యలు తీసుకోవాలని , మృతురాలి భర్త, పిల్లలకు తగిన న్యాయం చేయాలని మృతదేహంతో బంధువులు కుటుంబ సభ్యులు ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. మృతురాలికి భర్త వీరేశ్ తో పాటు ఇద్దరు చిన్న పిల్లలు , బంధువులు కన్నీరు మున్నీరుగా రోదించారు.. మృతురాలి భర్త వీరేష్ ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్సై రాంజీ నాయక్ తెలిపారు.



### న్యాయవాదుల హెల్త్ కార్డులు
# వెంటనే పునరిద్ధరించాలి

- **లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ వినతి.**

**ఎల్బీనగర్, విశాలభారతి:**

తక్షణమే న్యాయవాదుల హెల్త్ కార్డులు జారీ చేయాలని హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఏ. జగన్ కి,రంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ ప్రతాప్ రెడ్డి కి న్యాయవాదుల ఆరోగ్య కార్డు పథకానికి సంబంధించి అత్యవసర అంశాలపై వినతి పత్రం సమర్పించబడింది. ఇందులో ముఖ్యంగా ప్రస్తావించబడిన అంశాలు వెంటనే గడువు ముగిసిన ఆరోగ్య కార్డుల పునరుద్ధరణ చేయాలని న్యాయవాది కుటుంబ సభ్యులను అందరినీ చేర్చాలని అందరూ న్యాయవాదుల కు నూతనంగా హెల్త్ కార్డులు జారీ చేయాలని ప్రస్తుతం ఉన్న ఆరోగ్య కార్డు లిమిట్ ను రూ.10 లక్షల వరకు పెంపునకు కృషి చేయాలని ఈ అంశాలపై వెంటనే చర్యలు తీసుకుని, న్యాయవాదుల సంక్షేమార్థంగా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసే విధంగా ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పొన్నం రవీందర్ యాదవ్, మంచర్ల విష్ణు వర్ధన్, ఎం. రాము, వెంకట్ ,గోపీ గౌడ్రం గారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి ,మహిళా ప్రతినిధి అనసూయ లైబ్రరీ కార్యదర్శి వెంకటేశ్ యాదవ్,రంగారెడ్డి బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి రాములు, న్యాయవాదుల పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలి

- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.**

**సూర్యాపేట,విశాలభారతి:**




సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా అంకితభావంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారులు, ఆర్బీఎస్కే వైద్యాధికారులు, ఉప జిల్లా వైద్యాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. జిల్లాలో ఎక్కడ కూడా డెంగి, చికెన్ గునియా, మలేరియా, టైఫాయిడ్ జ్వరాల వంటి వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. పారిశుద్ధ్య పనులు పక్కాగా జరిగేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని దోమల నివారణకు అన్ని నివాస ప్రాంతాల్లో ఫాగింగ్ చేయించాలని,నిల్వ నీరు ఉన్నచోట మురుగు కాలువలలో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వంద శాతం బర్త్ ప్లానింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డెలివరీలు ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా చూడాలని, గర్భిణీలకు అన్ని చెకప్ లు జరిపించి సేవలందించాలని కలెక్టర్ తెలిపారు. జాతీయ టీకా వ్యాది నివారణ కార్యక్రమం క్రమం తప్పకుండా పాటించాలని తెలిపారు. క్షయ, కుష్టు వ్యాధి, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులందరికీ క్రమం తప్పకుండా మందులు ఇవ్వాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు మధ్యాహ్నం వేళలో తమ పరిధిలోని సబ్ సెంటర్ లను తనిఖీలు చేయాలని రాని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతంగా ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విధుల పట్ల ఎవరు నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో చంద్రశేఖర్, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ చంద్రశేఖర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కోటిరత్నం, డిప్యూటీ డిఎంహెచ్వో కోదాడ జయమానూరి, డాక్టర్ నాజ్య, డాక్టర్ శ్రీశైలం, వైద్య అధికారులు, ఆర్ బి ఎస్ కే సిబ్బంది, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



# హ్యాపీగా హరీష్ రావు బర్త్ డే

- **బీఆర్ఎస్ అధ్వర్యంలో జన్మదిన వేడుకలు**
- **ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ**
- **కేక్ కట్ చేసిన బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి**

**పటాన్ చెరు,విశాలభారతి**

తెలంగాణ ఉద్యమ నేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. హరీష్ రావు పుట్టిన రోజు సందర్భంగా పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ పటాన్ చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి హరీష్ రావు ప్రజల మనిషి అని, ఇలాంటి పుట్టిన రోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలని, నిండూ నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, జిన్నారం మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్, శ్రీధర్ చారి, తెల్లాపూర్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, యూత్ నాయకులు పృథ్వీరాజ్, మాణిక్ యాదవ్, నియోజవర్గ బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసు నిందితుడు అరెస్ట్

**ఆర్మూర్, విశాలభారతి:**




నందిపేట్ మండలం ఐలాపూర్ గ్రామ శివారులో వారం రోజుల క్రితం షాపూర్ గ్రామానికి చెందిన సాదాసుమలత హత్యకు గురైన విషయం తెలిసిందే. సాదా సుమలత కుమారుడు సంజయ్ ఫిర్యాదు మేరకు పోలీసులు గుర్తుతెలియని వ్యక్తులు చంపి ఉంటారని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అనంతరం మంగళవారం మధ్యాహ్నం ఆర్మూర్ నుండి నిర్మల్ వైపు వెళ్తుండగా చిట్టాపూర్ ఎక్స్ రోడ్ వద్ద పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆర్మూర్ రూరల్ సిఐ శ్రీధర్ రెడ్డి కథనం ప్రకారం ఆలూరు మండల కేంద్రానికి చెందిన వేల్పుల పెద్ద గంగాధర్ ( 46) నందిపేట్ వారంతా సంతలో సాదా సుమలతను పరిచయం చేసుకొని, మాయ మాటలు చెప్పి ద్విచక్ర వాహనంపై ఐలాపూర్ శివారులో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లాడు. అనంతరం అత్యాచారానికి ప్రయత్నం చేశాడు. వాగ్వాదం అనంతరం పెనుగులాటలో మృతురాలు ప్రతిఘటించడంతో తన వద్ద ఉన్న టవల్ తో ఉరివేసి చంపినట్లు నిందితుడు అంగీకరించాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు. వారం రోజుల నుండి నిందితుని పట్టుకోవడానికి చేసిన పరిశోధనలో చాకచక్యంగా వ్యవహరించిన నందిపేట్ ఎస్సై చిరంజీవి. టాస్క్ ఫోర్స్, క్రైమ్ బ్రాంచ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్, అనిల్, అమర్ సింగ్ లను సీఐ శ్రీధర్ రెడ్డి అభినందించారు.




# షార్ట్ సర్క్యూట్తో ఎనిమిదిలక్షల ఆస్తి నష్టం

- **అగ్నికి ఆహుతైన మెకానికల్ సర్వీస్ సెంటర్**

**విశాలభారతి,భీమదేవరపల్లి:**



హనుమకొండ ప్రధాన రోడ్డుకు సమీపంలోని ముల్కనూర్ గ్రామంలో గల ఓ మెకానికల్ సర్వీస్ సెంటర్లో సోమవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాదాపు ఎనిమిది లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు శ్రీరామోజు అనిల్ తెలిపాడు. అప్పుచేసి బైక్ మరియు కార్ సర్వీసింగ్ కోసం సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నానని, ఈ వ్యవస్థతోనే కుటుంబాన్ని పోషిస్తున్నానని అనిల్ ఆవేదన వ్యక్తం చేశాడు. షార్ట్ సర్క్యూట్ కారణంగా కంప్రెసర్ మిషన్, త్రీ ఫ్రెస్, వాకింగ్ క్లీనర్, బ్లోయర్లు, ఇతర రిపేరింగ్ ఉపకరణాలు సహా ఇటీవల కొనుగోలు చేసిన స్పేర్ పార్ట్స్ అన్నీ అగ్నికి ఆహుతైనట్లు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే స్థానికులు మంటలను అదుపులోకి తీసుకు వచ్చినప్పటికీ అప్పటికే అధికంగా నష్టం సంభవించిందని అనిల్ వాపోయాడు. దుకాణం మొత్తం దగ్ధమై జీవనాధారం కోల్పోయిన తరుణంలో ప్రభుత్వం సహాయం అందించాలని కోరారు.

**అధికారులు స్పందించాలి**

బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



### బక్రీద్ పండుగను ప్రజలు
# ప్రశాంతంగా జరుపుకోవాలి

- **శాంతికి మారుపేరు సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్**

**సూర్యాపేట,విశాలభారతి:**

బక్రీద్ పండుగను సోదర భావంతో కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని డిఎస్పి ప్రసన్న కుమార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రం కిరాణం మర్చంట్ ఫంక్షన్ హాల్లో, జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు పీస్ కమిటీ మీటింగ్ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట ప్రజలు కుల,మతాలకతీతంగా సుహృద్భావ వాతావరణంలో పండుగలు జరుపుకొనే సంప్రదాయం ఎంతో సంతోషంగా ఉన్నదని అన్నారు. ఈనెల 7 వ తేదీన బక్రీదు పండగ అని దానిని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు. సాంప్రదాయాల నుండే చట్టాలు వచ్చాయని తెలిపారు. సోషల్ మీడియాను వేదికగా చేసుకొని కుల మతాల మధ్యలో విభేదాలు సృష్టించే వీడియోలు, ఫొటోస్ పెడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా చట్టాన్ని చేతులకు తీసుకోవడం నేరమని అన్నారు.సోషల్ మీడియాలో మత కలహాలను సృష్టించే విధంగా, విషపూరిత పుకార్లను నమ్మవద్దని కోరారు. చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే మీరు పోలీసులకు ఇన్ఫర్మేషన్ ఇవ్వాలని తెలిపారు. ప్రపంచ మొత్తానికి సూర్యపేట రోల్ మోడల్ గా ఉండాలని అన్నారు. మీకు ఏ సమస్యలు వచ్చినా సూర్యాపేట అధికారులను సంప్రదించాలని అన్నారు. హిందూ, ముస్లిం మతాలకు చెందిన మత పెద్దలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సీఐ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్బి శ్రీనివాస్, ఎమ్మార్వో కృష్ణయ్య, వెహికల్ ఇన్స్పెక్టర్ జయప్రకాశ్ రెడ్డి, ఎస్సైలు ఏడుకొండలు, సైదులు, ఆంజనేయులు, ప్రవీణ్, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, హిందూ, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- **లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం.**
- **విద్యారంగాన్ని విస్మరించడంలో బిఆర్ఎస్, కాంగ్రెసులకు తేడా లేదు..**
- **ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్**

**విశాలభారతి,ఎల్కతుర్తి:**

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని ఖాళీగా ఉన్న టీచర్స్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎల్కతుర్తి మండల విద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో ఆపరేటర్ సురేష్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్ మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు 18 నెలలు గడుస్తున్న ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయలేదని విమర్శించారు. ఈనెల జూన్ 12న ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నందున సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలో కొట్టుమిట్టాడుతున్నాయని విద్యార్థులను వంచించడంలో బి ఆర్ ఎస్ కు కాంగ్రెస్ కు పెద్ద తేడా లేదని విమర్శించారు. రానున్నది వర్షాకాలమని జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కొన్ని బిల్డింగ్స్ శిథిలావస్థలో ఉన్నాయని అట్లాంటి పాఠశాలల బిల్డింగులను గుర్తించి డిస్మెటల్ చేసి నూతన భవనాలను నిర్మించాలని అదేవిధంగా తరగతులకు అనుగుణంగా టీచర్స్ ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండ చరణ్, పెండ్యాల అరుణ్, చిర్ర సాయి, పెండ్యాల రామ్ చరణ్, తదితరులు పాల్గొన్నారు.




### తడి,పొడి చెత్తను వేరుచేసి
# మున్సిపల్ వాహనాలకు అందివ్వాలి

**సూర్యాపేట,విశాలభారతి:**

100 రోజుల ప్రణాళిక లో భాగంగా 2 వరోజు సూర్యాపేట పట్టణంలోని కోమటి కుంట ఎస్.సి కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రాంతంలో మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ బి.శ్రీనివాస్ ,అధికారులు,సిబ్బంది పాల్గొని తడిపొడి చెత్త ని వేరుచేయు విధానము పై గృహ యజమానులకు ప్రజలకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగు ఆయిన సౌకర్యాలు కల్పించుటకు గాను 100 రోజుల ప్రణాళిక ను అమలు చేస్తున్నదని, ఇట్టి ప్రణాళికలో భాగంగా నిర్దేశించిన అంశంల పై ప్రజలకు అవగాహన కల్పించుట జరుగుతుందని అన్నారు. 2 వ రోజు కార్యక్రమంలో భాగంగా విధులలో సంచరించు కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని, చిన్న పిల్లలను కుక్కలకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలని అన్నారు. వార్డు లలో నీటి సరఫరా కు సంబంధించి క్లోరినేషన్ టెస్టు లు చేయడం జరిగిందని,వార్డ్ లో నిరుపేద మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘము చేయుటకు ప్రతి పాధించ నయినదని, స్ట్రీట్ వెండర్ సంఘాలు చేయుటకు సర్వే చేయుట జరిగిందని తెలిపారు. వార్డు లో వ్యాపారాలు చేయు వాటిని గుర్తించుట జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీ.ఇ.సత్యారావు,సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్లశ్రీనివాస్, ఏ.ఇ.తిరుమలయ్య,యేనేపల్లి యాదగిరి, టిఎంసి శ్వేత,ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్, 2 వ వార్డు అధికారీ శివాజి, సీవోలు ,ఆర్పీలు మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం,
04.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## నేడే లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

**విశాలభారతి,భీమదేవరపల్లి :**

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రేపు (జూన్ 4) ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరేశం వెల్లడించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారుల నేతృత్వంలోని ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వీరేశం మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా అధికారులు కృషి చేస్తారని, కార్యక్రమం సమర్థవంతంగా సాగేలా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

# సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్ ఇబ్రహీంపట్నం డివిజన్ కమిటీ ఎన్నిక
- జర్నలిస్ట్ సమస్యలపై సమరశీల పోరాటాలు
- అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇండ్ల స్థలాలు , అక్రిడేషన్లు
- టీడబ్లుజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని టీడబ్లుజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు అన్నారు. ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని కన్వేషన్ హాల్ లో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్ ఇబ్రహీంపట్నం డివిజన్ కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యుజేఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో గడిచిన ఏడాదిన్నర కాలంగా జర్నలిస్టులు అనేకరకాల సమస్యలతో సతమతమవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. జర్నలిస్టులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. టిడబ్ల్యూజేఎఫ్ ఇబ్రహీంపట్నం డివిజన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య జిల్లాలో సుదీర్ఘ కాలంగా పెండింగ్ లోనే కొనసాగుతోందని, కొన్ని ప్రాంతాల్లో ఇండ్ల స్థలాలు ఇచ్చినా జిల్లా వ్యాప్తంగా ఇవ్వాల్సి ఉందన్నారు. జర్నలిస్టులో ఇళ్ల స్థలాలతో పాటు ఇతరేతర ప్రధాన సమస్యలన్నింటి పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎక్కడికక్కడ ఆందోళన కార్యక్రమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ కాలపరిమితి విషయంతో పాటు విధివిధానాల రూపకల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిన్న పెద్ద పత్రికలను తేడా లేకుండా జర్నలిస్టులందరికీ అక్రిడియేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. హెల్త్ కార్డులను అందజేయాలని తెలిపారు. జర్నలిస్టు కుటుంబాల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు రాయితీని వర్తింపజేయాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగిందని, పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి జర్నలిస్టులందరికీ ఫీజు రాయితీ లెటర్లు అందజేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి జిల్లా విద్యాధికారికి లేఖ రాశారని గుర్తు చేశారు. ప్రతి ఒక్క జర్నలిస్టు పాఠశాల ప్రారంభం కాగానే జిల్లా విద్యాధికారిని కలిసి లేటరు తీసుకునే ప్రయత్నం చేయాలని, ఒకవేళ్ళ జిల్లా విద్యాధికారి లేటర్ ఇవ్వకపోతే తమ దృష్టికి తేవాలన్నారు. తామంతా జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు అందుబాటులో ఉంటామని ప్రతి జర్నలిస్టుకు తమ పిల్లల చదువుల ఫీజు రాయితీ లీటర్లు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. జర్నలిస్టు సంక్షేమమే కేంద్రంగా ప్రస్తుత అకాడమీ పెద్దలు పనిచేయాలని కోరారు.

**నూతన కమిటీ ఎన్నిక**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఇబ్రహీంపట్నం డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా సిలివేరు యాదగిరి, పల్నాటి జగన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గుండెమోని శివకుమార్ , పి. శ్రీను, జుబ్బూరి కుమార్, , సహాయ కార్యదర్శులుగా ఎర్ర లింగం, నలపరాజు సైదులు, కోశాధికారిగా ఆలంపల్లి రవీందర్, ప్రచార కమిటీ సభ్యులుగా కందుకూరి నగేష్ ఎన్నికయ్యారు. త్వరలో జరుగుతున్న జిల్లా కమిటీకి ఇబ్రహీంపట్నం ప్రాంతం నుంచి పంది వెంకటేష్ పంది క్రాంతి కుమార్, దుబ్బాక యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా జోగు శ్రీనివాసులు ఇబ్రహీంపట్నం డివిజన్ కమిటీ ప్రతిపాదించింది. ఈ సమావేశంలో ఫెడరేషన్ సీనియర్ నాయకులు చిలువేరు సురేష్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.



## డివిజన్ల అభివృద్ధికి నిధులకు కేటాయించండి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ తో సమావేశం

**పటాన్ చెరు,విశాలభారతి**

బల్దియా పరిధిలోని భారతి నగర్, పటాన్చెరు, రామచంద్రపురం డివిజన్ల పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని.. నూతన పారిశుద్ధ్య వాహనాలు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు సహకారం అందించాలని శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ ను పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. మంగళవారం శేరిలింగంపల్లి జిహెచ్ఎంసి. జోనల్ కమిషనర్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ తో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మూడు డివిజన్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, పెండింగ్ పనులపై చర్చించారు. పారిశుద్ధ విభాగంలో దీర్ఘకాలంగా సెలవులో ఉన్న ఉద్యోగులు, చనిపోయిన వారి స్థానాల్లో నూతన ఉద్యోగులను నియమించాలని కోరారు. పటాన్చెరు డివిజన్ పరిధిలో నిర్మిస్తున్న ఆడిటోరియం, కమ్యూనిటీ హాల్స్, వార్డ్ ఆఫీస్ నిర్మాణ పనులు చాలా రోజులుగా నిలిచిపోయాయని.. వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆడిటోరియం, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పూర్తయితే ప్రభుత్వ ప్రైవేటు కార్యక్రమాలకు ఆధునిక వసతులతో కూడిన భవనం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పారిశుద్ధ్య విభాగంలో వాహనాల కొరత మూలంగా చెత్త సేకరణ ఇబ్బందిగా మారుతోందని..వెంటనే నూతన వాహనాలతో పాటు మినీ టిప్పర్లు, నిచ్చెనులతో కూడిన వాహనాలను కేటాయించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ హేమంత్.. అతి త్వరలో సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సురేష్, ఎస్ ఈ శంకర్ నాయక్, డి ఈ నరేందర్, దేవేందర్, ఏఈ శివ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కృష్ణారావును కలిసిన హైదర్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు

## భవిష్యత్‌లో అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ పార్టీయే

- ఎమ్మెల్యే కృష్ణారావు

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే మళ్ళీ కేసీఆర్ సీఎం కావడం ఖాయమని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏం.ఏ. ఖదీర్ ఆద్వరంలో ఆ పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హైదర్ నగర్ డివిజన్ నాయకుడు ఖదీర్ డివిజన్లోని పలు సమస్యలు నాయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేలా చొరవ తీసుకుంటారని వారికి హామీ ఇచ్చారు.అలాగే భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎండి సలీం,ఎస్ కే షరీఫ్,ఎస్ కే హబీబ్,ఎండి బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇది ప్రజాపాలన కాదు ప్రజా వ్యతిరేక పాలన

- బిఆర్ఎస్ నేత సిందం శ్రీకాంత్

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**



టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సిందం శ్రీకాంత్

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన కాదు ప్రజా వ్యతిరేక కాలం నడుస్తోందని హైదర్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు సింగం శ్రీకాంత్ విమర్శించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీ లని కనీసం 12 గంటలు గడవకముందే జిహెచ్ఎంసి అధికారులతో తొలగించి వేయడం దారుణమన్నారు. కాంగ్రెస్ పాలన ప్రజా పాలన కాదు,తెలంగాణ ప్రజల వ్యతిరేక పాలన అని సిందం శ్రీకాంత్ తీవ్రంగా ఆక్షేపించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు ఫ్లెక్సీలు నెలల తరబడి వేలాడుతున్న తీయకుండ వదిలేస్తారు.అదే ప్రతిపక్ష పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మాత్రం గంటల వ్యవధిలో తొలగించడం వారి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించడం దుర్మార్గమని, కనీసం తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ దినోత్సవమని కూడా గౌరవం లేకుండా తొలగించడంతో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పట్ల గౌరవం, చిత్తశుద్ధి లేదని తేటతెల్లమవుతుంది అన్నారు. నాటి ఉద్యమ సమయంలో రేవంత్ రెడ్డి ఉద్యమకారులను భయభ్రాంతులకు గురిచేసి ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నంలో తుపాకీ పట్టుకొని వచ్చిన తుపాకీ రాయుడు రేవంత్ రెడ్డికి తెలంగాణ విలువ తెలవదని ఆయన దుయ్యబడ్డారు.బిఆర్ఎస్ పార్టీ నాయకులను ఇబ్బంది పాలు చేయాలన్న ధ్యాస పక్కన పెట్టి,సగం శ్రద్ధ పరిపాలన మీద పెడితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందన్నారు.నేడు బస్తీల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని,వీధి దీపాలు గత కొన్ని నెలలుగా వెలుగడం లేదని, పలు అంశాలను అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లి ఫిర్యాదు చేసినా..అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకునే పరిస్థితుల్లో లేరని ,రాష్ట్ర పరిపాలన గతి తప్పిందని ఈ సందర్భంగా ఆయన విమర్శించారు.



## ఘనంగా ట్రబుల్ షూటర్ హరీష్ రావు జన్మదిన వేడుకలు

- బీఆర్ఎస్వీ నేత మేరాజ్ ఖాన్ అధ్వర్యంలో సంబరాలు
- కంజర్ల అనాధ ఆశ్రమంలో పిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ

**పటాన్ చెరు,విశాలభారతి**

మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలును బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు ఎం.డి మేరజ్ ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పెద్దకంజర్ల పరిధిలోని అనాథ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనాధ పిల్లలతో కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేరాజ్ ఖాన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ నాయకుడు, పోరాటాల వీరుడు హరీష్ రావు రాష్ట్రం కోసం, రాష్ట్ర ప్రజల బాగు కోసం రాత్రింబగళ్ళు కష్టపడే శ్రమజీవి అని కొనియాడారు. ప్రతి ఇంటికి పెద్ద కొడుకై వాళ్ళ కష్టాల్లో పాలుపంచుకునే నాయకుడని, జనం గుండెల్లో జనహృదయ నేతగా పేరు పొందారని అని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా తెలంగాణలోని చెరువులు, కుంటలు నింపిన అపార భగీరథుడు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణ ముదిరాజ్, సురేష్, నాని, వసీమ్, మొయిజ్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



## భీమదేవరపల్లిలో రెవెన్యూ సదస్సు

- ప్రజల సమస్యలపై స్పందించిన తహసీల్దార్ అనిల్

**విశాలభారతి,భీమదేవరపల్లి:**

భీమదేవరపల్లి ప్రభుత్వ హైస్కూల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు ప్రజల సందేహ నివృత్తికి వేదికైంది. ఈ సదస్సుకు మండల తహసీల్దార్ అనిల్ అధ్యక్షత వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై తమ భూ సమస్యలు, సంబంధిత అంశాలు, ఆదాయ, నివాస, రేషన్ కార్డుల సంబంధించిన సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ అనిల్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ కట్టుబడి ఉన్నదన్నారు. అందరు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సేవలన్నీ పారదర్శకంగా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా సంబంధిత విభాగాధికారులు అనేక అంశాలపై స్పష్టతనిచ్చి, కొన్నింటికి తక్షణమే పరిష్కారాలు సూచించారు. భూ స్థితిగతుల వివరాలు, ఆన్‌లైన్ సేవల వినియోగంపై అధికారులు ప్రజలకు అవగాహన కలిగించారు. గ్రామస్తులు ఈ సదస్సు ఏర్పాటు చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- జిన్నారంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ ప్రారంభం

**పటాన్ చెరు (జిన్నారం),విశాలభారతి:**

నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఐదు లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన మోడల్ హౌస్ ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సొంతింటిని నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకున్నప్పుడే ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతం అవుతుందని అన్నారు. పూర్తి పారదర్శకతతో రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3500 మంజూరు కావడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఇల్లు మంజూరు అవుతాయని తెలిపారు. నూతన టెక్నాలజీతో అత్యంత తక్కువ ఖర్చుతో.. అన్ని సదుపాయాలతో ఇంటిని నిర్మించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, ఎంపీడీవో అరుణ రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రాథమిక విద్యకు గొడ్డలిపెట్టు


- ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు వి.వి నాయక్

**సూర్యాపేట,విశాలభారతి:**

పాఠశాలలు ప్రారంభమయ్యే సమయంలో ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు నిర్ణయం తీసుకోవడం ప్రాథమిక విద్యకు గొడ్డలిపెట్టులాంటిదని ఎల్ఎఫ్ఎఫ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు వాంకుడోతు వెంకన్న నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ముందస్తుగా ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ఎన్నో సంవత్సరాలుగా ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరుతున్నా అమలు సాధ్యం కావడం లేదన్నారు. ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు మొత్తం 18 సబ్జెక్టులు ఉంటాయని, 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధించడం సాధ్యం కాదన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను ఉపసంహరించుకోవాలని, లేదా జూన్ 30నాటికి వాయిదా వేస్తే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను లెక్కించే అవకాశం ఉంటుందన్నారు. ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు ఉన్న చోట ఉపాధ్యాయులు, విద్యార్థి నిష్పత్తిలో ప్రధానోపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

## cinema updates

# మొన్న అలియా భట్.. ఇప్పుడు త్రిష..



నాలుగు పదుల వయసులో కూడా త్రిష చేతినిండా సినిమాలతో కెరీర్లో దూసుకెళ్తుంది. రీసెంట్ గా గుడ్ బ్యాడ్ అగ్లీ మూవీతో సూపర్ హిట్ ను తన అకౌంట్ లో వేసుకున్న త్రిష సుమారు రెండు దశాబ్దాలుగా సినీ రంగంలో సత్తా చాటుతుంది. మధ్యలో కెరీర్ కు బ్రేక్ వచ్చినప్పటికీ పొన్నియన్ సెల్వన్ తర్వాత అమ్మడి క్రేజ్ పెరిగింది. దీంతో సెకండ్ ఇన్నింగ్స్ లో కూడా త్రిషకు మంచి ఆఫర్లు దక్కుతున్నాయి. తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో అనేక సినిమాల్లో నటించిన త్రిష చేతిలో ప్రస్తుతం థగ్ లైఫ్, విశ్వంభర సినిమాలున్నాయి. కమల్ హాసన్ సరసన మణిరత్నం దర్శకత్వంలో త్రిష నటించిన థగ్ లైఫ్ సినిమా రిలీజ్ కు రెడీ అయింది. జూన్ 5న థగ్ లైఫ్ ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులు ముందుకు రానుంది. ప్రమోషన్స్ లో భాగంగా పలు ఈవెంట్స్ లో పాల్గొంటున్న త్రిష కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను షేర్ చేసుకుంటుంది. మలయాళీ నటుడు ఫహాద్ ఫాజిల్ అంటే తనకు ఇష్టమని, ఆయనతో కలిసి నటించడం తనకు చాలా ఇష్టమని చెప్పుకొచ్చింది. మీరు ఎవరితో నటించాలనుకుంటున్నారని రీసెంట్ గా ఓ సందర్భంలో త్రిషను అడగ్గా అమ్మడు ఫహాద్ ఫాజిల్ పేరు చెప్పింది. ఫహాద్ ఫాజిల్ తో నటించాలనుంది. అతనెలాంటి కథనైనా, ఎలాంటి క్యారెక్టర్లో అయినా అద్భుతంగా నటించగలడు. అతను చాలా అద్భుతమైన నటుడు అని మనసులోని మాటను బయటపెట్టింది త్రిష. త్రిష చెప్పినట్టు ఫహాద్ చాలా గొప్ప నటుడు. ఎలాంటి పాత్రనైనా, ఎలాంటి సినిమానైనా చేయగల కెపాసిటీ ఉన్న యాక్టర్. మొన్నటికి మొన్న అలియా భట్ కూడా ఫహాద్ అంటే ఇష్టమని, కచ్చితంగా అవకాశం వస్తే అతనితో కలిసి నటించడానికి రెడీగా ఉన్నానని చెప్పింది. ఇప్పుడు త్రిష కూడా ఫహాద్ అంటే ఇష్టమని, తనతో కలిసి నటించాలనుందని తెలిపింది. ఇక థగ్ లైఫ్ విషయానికొస్తే ఈ సినిమా నాయగన్ ను మించి ఉంటుందని చిత్ర యూనిట్ మొత్తం ఎంతో గొప్పగా చెప్తుంది. దీంతో పాటూ త్రిష, చిరంజీవితో చేస్తున్న విశ్వంభర సినిమాపై కూడా అందరిక మంచి అంచనాలున్నాయి.



ఆస్కార్ అవార్డు గ్రహీత, వేధింపుల రాక్షసుడు కెవిన్ స్పేసీ కొన్నేళ్ల పాటు జైలు జీవితం గడిపి, బెయిల్ పై బయటకు వచ్చిన సంగతి తెలిసిందే. అతడు తన సినిమాల సెట్స్ లో మేల్, ఫీమేల్ నటీనటులను లైంగికంగా వేధించాడని ఆరోపణలు వచ్చాయి. వాటిలో కొన్ని నిరూపణ అయ్యాయి. కోర్టు అతడికి చాలా శిక్షలు విధించింది. అయినా అతడు ఇప్పుడు జైలు బయటకు వచ్చాడు. దాదాపు 20 ఏళ్ల తర్వాత `హోలీ గార్డ్స్` అనే చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు.ఇది సూపర్ నేచురల్ యాక్షన్ థ్రిల్లర్. ఈ చిత్రంతో బాలీవుడ్ నటి దిశా పటానీ హాలీవుడ్ లో రీఎంట్రీ ఇస్తోంది. ఇది దిశా పటానీకి రెండో హాలీవుడ్ చిత్రం. దిశా ఇంతకుముందు జాకీ చాన్ సరసన `కుంగు ఫూ యోగా` అనే చిత్రంలో నటించింది. ఇప్పుడు కెవిన్ స్పేసీ దర్శకత్వంలో నటిస్తూ, ప్రపంచం దృష్టిని ఆకర్షించింది అంతర్జాతీయ తారాగణం ఉన్న ఈ చిత్రంలో మెక్సికోలో చిత్రీకరిస్తున్నారు. హోలీగార్డ్స్ అనేది స్టాటిగార్డ్స్ వర్సెస్ హోలీగార్డ్స్ అనే ఫ్రాంచైజీలో భాగం. సూపర్ నేచురల్ థ్రిల్లర్ కాన్సెప్టుతో ఇందులో సినిమాలు రూపొందుతన్నాయి. ఇప్పటికే ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశకు చేరుకుందని సమాచారం. ఈ మూవీ సెట్స్ నుంచి దిశా లుక్స్ కొన్ని విడుదలై సంచలనం సృష్టిస్తున్నాయి. ఆన్ లొకేషన్ దిశా ఎంతో అందంగా కనిపిస్తోంది. ఈ ఏడాది జనవరిలోనే దిషా మెక్సికోలోని డురాంగోలో టైరెస్ గిబ్సన్ , హ్యారీ గుడ్విన్స్ లతో కలిసి పైలెట్ షూటింగ్ లో పాల్గొంది. ఆ సన్నివేశాల నుండి తీసిన ఫుటేజ్ చాలా అద్భుతంగా ఉంది. దిశా పాత్ర విజువల్ గా అద్భుతంగా ఉందని ప్రశంసలు కురుస్తున్నాయి. ఇందులో డాల్ఫ లండ్గ్రెన్, టైరీస్ గిబ్సన్, బ్రియానా హిల్డెబ్రాండ్ వంటి తారాగణం నటిస్తున్నారు. దిశా ఈ ఏడాదిలో విడుదల కానున్న `వెల్కం 3`లోను నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కామెడీ యాక్షన్ ఎంటర్ టైనర్ లో అక్షయ్ కుమార్ సహా పలువురు అగ్ర నటీనటులు నటిస్తున్నారు. రొమాన్స్, యాక్షన్, కామెడీ నేపథ్యంలో రక్తి కట్టించే కథాంశంతో ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.